## క్లుప్తంగా

### కల్వర్టుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

శావల్యాపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉన్న కల్వర్టుపై రంధ్రం ఏర్పడి కార్యాలయానికి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిస్తే ఆస్పత్రికే ఈనెల 6న 'సాక్షి' కథనంపై అధికారులు స్పందించారు. సత్వరమే కల్వర్టుపై ఏర్పడిన గుంతను మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారించటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం జంక్షన్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. టాటా ఏస్ వాహనం జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా అదే సమయంలో గుడివాడ డిపోకు చెందిన తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాదంలో ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

### విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారి పాలెం గ్రామానికి చెందిన రాపూరి ఆంజనేయులు(51) విద్యుదాఘాతంతో శనివారం రాత్రి మృతి చెందాడు. గృహంలో ఫ్యాన్‌కు సంబంధించిన వైర్లను విద్యుత్ బోర్డులో పెడుతుండగా షాక్‌కు గురయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు గ్రామానికి వెళ్లి ఆంజనేయులు మృతదేహానికి నివాళుర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట వడ్లమూడి శివరామయ్య, వేల్పుల శింహాద్రి యాదవ్, కొట్టా కిరణ్, గడిపూడి నరసింహారావు, వడ్లమూడి పట్టాభి రామారావు ఉన్నారు.

### కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలి

శావల్యాపురం: జన్మభూమి రుణం తీర్చుకోవటం దేవుడు ఇచ్చిన వరం పోట్లూరు పంచాయతీ అభివృద్ధి ప్రదాత, జెడ్పీ హైస్కూలు అభివృద్ధి ప్రదాత గడుపూడి వెంకట రాయుడు అన్నారు. ఆదివారం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో గ్రామపంచాయతీ పరిధిలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రవాస భారతీయులు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ అభివృద్ధికి అందరు తమ వంతు సాయం అందించాలన్నారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఆరుగురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ప్రవాస భారతీయులు వీరవల్లి ప్రతాప్, నన్నూరి వీర రాఘవులు, గ్రామస్తులు గడుపూడి నాగేశ్వరరావు, అబ్బూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ముగిసిన వారాహి నవరాత్రులు



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలోని కనకదుర్గమ్మ అమ్మ వారి దేవాలయంలో వారాహి మాతా నవ రాత్రులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాల నరసింహారావు మాట్లాడుతూ భక్తుల సహకారంతో నవరాత్రులు విజయవంతం చేశామన్నారు. చివరిరోజు అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేకంగా అలంకరణ చేసి పూలమాలల వేసి మహిళ భక్తులతో అమ్మవారికి కుంకుమాభిషేకం, అభిషేకాలు అర్చనలు విశేష పూజలు ఆలయ పూజారి రావిపాటి సాయి భరతశర్మ సారథ్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటి సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

### వైకుంఠపురంలో తొలి ఏకాదశికి ఏర్పాట్లు



అమరావతి: మండలంలోని వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17న తొలి ఏకాదశి పండగను ఘనంగా నిర్వహించటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ అమరావతి, తుళ్ళూరు, తాడికొండ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారన్నారు. కొండ మీదకు వెళ్లే భక్తులకు దారిలో మంచినీరు, ఉత్తర వాహినీ స్నాన ఘట్టంలో స్త్రీలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి సుధా స్వరూప్, గ్రామస్తుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# శివప్రియనగర్ అభివృద్ధికి అడుగులు

- సంఘంగా ఏర్పడి పనులు చేపట్టిన ప్లాట్ల యజమానులు
- పొదలు తొలగింపు, రోడ్ల నిర్మాణం పనులు
- పంచాయతీ పరిధిలో 2.03 ఎకరాల కమ్యూనిటీ స్థలం
- మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకి వినతి



శివప్రియనగర్ లేఔట్ దృశ్యం

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని అధికారిక లేఔట్ అయిన శివప్రియనగర్ ప్లాట్ల యజమానుల సమస్యలు త్వరలో తీరనున్నాయి. నలభై ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 600 ప్లాట్లను వివిధ వర్గాలకు చెందిన ప్రజలు కొనుగోలు చేశారు. 1998లో ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు పొంది ఈ వెంచర్ వేశారు. మొదటి దఫా 25.25 ఎకరాల్లో 344 ప్లాట్లు వేయగా, కమ్యూనిటీ అవసరాల నిమిత్తం 2.52 ఎకరాలను గణపవరం పంచాయతీకి కేటాయించారు. అయితే వెంచర్‌లో ఇప్పటి వరకు కంప చెట్లు పెరిగి చిట్టడివిలా మారింది. లబ్ధిదారులు తమ ప్లాట్లు ఎక్కడున్నాయో కనుక్కోలేని స్థితి నెలకొంది. అయితే ఈ వెంచర్‌లో ఎక్కువ మంది లబ్ధిదారులు చీరాల, అద్దంకి, చీమకుర్తి, గుంటూరు, తిమ్మాపురం, గణపవరం, చిలకలూరిపేట ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. లేఔట్ అభివృద్ధికి ఇటీవల లబ్ధిదారులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. శివప్రియనగర్ ప్లాట్ల యజమానుల సంఘం పేరిట ఏర్పడిన సంఘం ఆధ్వర్యంలో లేఔట్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. రోడ్లను మళ్లీ అభివృద్ధి చేస్తున్నారు.

**స్థానిక ఎమ్మెల్యేకు వినతి...**

శివప్రియనగర్ ప్లాట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు పేలూరి రామారావు, కార్యదర్శి దివ్వెల సుబ్రహ్మణ్యం, జాయింటు సెక్రటరీ వీరాంజనేయులు, పలువురు ప్లాట్ల యజమానులు ఇటీవల ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలసి సమస్యను వివరించారు. మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే చేయూతనందిస్తానని హామీనిచ్చారు.

**కమ్యూనిటీ భూమి ఆక్రమణ...**

శివప్రియనగర్‌లో కమ్యూనిటీ అవసరాలకు విడిచి పెట్టిన 2.03 ఎకరాల భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడని, అక్రమంగా దున్ని సాగు చేసుకుంటున్నాడని లేఔట్ సంఘం నాయకులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, సర్వే నంబరుపై లావాదేవీలు జరగకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు.

**ఆక్రమణలు తొలగించాం**



గతేడాది నుంచి శివప్రియనగర్ ప్లాట్ల యజమానులను గుర్తించే కార్యక్రమం చేపట్టాం. వారిని కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేశాం. ప్లాట్లలో పెరిగిన కంప చెట్లను తొలగించాం. లేఔట్ పూర్తిగా సిద్ధమైతే మోడల్ కాలనీగా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం.

–పేలూరి రామారావు, ప్లాట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు

**సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించాం**



అప్పట్లో నెలకు రూ.500 చొప్పున చెల్లించి సెంటు రూ.35 వేల చొప్పున కొనుగోలు చేశాం. అయితే ప్లాట్లు వేసిన యాజమాన్యం లేకపోవటంతో ప్లాట్లలో సమస్యలు నెలకొన్నాయి. తామే ఓ సంఘంగా ఏర్పడి లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యను విన్నవించాం. ఆయన సానుకూలంగా స్పందించారు.

– దివ్వెల సుబ్రహ్మణ్యం, సంఘం కార్యదర్శి.

# మోడరన్ మహేష్‌కు గౌరవ డాక్టరేట్

- ప్రదానం చేసిన అమెరికా మేరిల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ
- విద్యారంగంలో సేవలకు దక్కిన అరుదైన గౌరవం



చేబ్రోలు మహేష్

నాదెండ్ల: విద్యా రంగంలో విశేషంగా సేవలందిస్తున్న చిలకలూరిపేట మోడరన్ విద్యాసంస్థల అధినేత చేబ్రోలు మహేష్ ప్రతిష్టాత్మక అమెరికా మేరిల్యాండ్ స్టేట్ యూనవర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. దేశరాజధాని ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో ఇటీవల యూనివర్సిటీ ఆధ్వర్యంలో పలు రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. నలభై ఏళ్లుగా కేజీ నుంచి పీజీ వరకూ పలు విద్యాసంస్థలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యనందిస్తున్న మహేష్ సేవలను గుర్తించిన యూనివర్సిటీ, గౌరవ డాక్టరేట్‌ను అందించింది. నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన చేబ్రోలు మహేష్ విద్యాభ్యాసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, 6–10 వరకూ కావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. డీఆర్‌ఎన్‌ఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, నాగార్జున యూనివర్సిటీలో ఎంకా పట్టా అందుకున్నారు. 1991లో అధ్యాపకుడి వృత్తిలో ప్రవేశించి కామర్స్ అధ్యాపకుడిగా పలు సంవత్సరాలు పనిచేశారు. 1993లో చిలకలూరిపేటలో మోడరన్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి కేజీ నుంచి పీజీ వరకూ విద్యనందిస్తున్నారు. ఈయన విద్యా సంస్థల్లో లక్షల మంది విద్యాభ్యాసం పూర్తి చేశారు. కేరళకు కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ, మోడరన్ పూర్వ విద్యార్థి కావటం విశేషం. మహేష్ ప్రముఖ యూనివర్సిటీ నుంచి అవార్డు అందుకోవటంపై పలువురు పట్టణ ప్రముఖులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అభినందించారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడు రామాచారికి సన్మానం



రామాచారి దంపతులను సన్మానిస్తున్న ప్రముఖులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం నడిగడ్డలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ గ్రహిత వీసీహెచ్ రామాచారి ఉద్యోగ విరమణ సభ వినుకొండ పట్టణంలోని వీఎల్ఎస్ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బోడెపూడి హనుమయ్య మాట్లాడుతూ రామాచారి విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడమే కాక పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనడం ఆనందదాయకమన్నారు. అనంతరం రామాచారి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పీజీ లూకా, ప్రముఖ కవి కేజీ రమేష్, హనుమంతాచారి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఎంఈఓలు సాంబశివరావు, ప్రసన్న, ఎస్‌టీయూ చంద్రజిత్‌యాదవ్, ఆవుల రమేష్, ప్రసాద్, బ్రహ్మయ్య, భక్తుల నాగేశ్వరరావు, సత్తార్ పాల్గొన్నారు.

# కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు

శావల్యాపురం: అర్హత కలిగి యున్న కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు మంజూరు చేస్తామని తహసీల్దారు నక్కా లక్ష్మీలావణ్య ఆదివారం తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా భూ యజమాని అంగీకారంతో క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హత కలిగియున్న కౌలు రైతులందరికీ పారదర్శకంగా రుణ అర్హత కార్డులు మంజూరు చేస్తామన్నారు. రుణ అర్హత ధ్రువీకరణ పత్రం గడువు 11 నెలల వ్యవధి మాత్రమే అన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 1850 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 580 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేశామని చెప్పారు. అలాగే గ్రామాల్లో కుల ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి సుమోటోగా నమోదు చేసి వీఆర్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి తదుపరి సత్వరమే కుల ధ్రువీకరణ పత్రం మంజూరు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నూతన విధానం వలన భవిష్యత్‌లో రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా నేరుగా సచివాలయం ద్వారా అర్జీ చేసుకున్న గంటల వ్యవధిలో కుల ధ్రువీకరణ పత్రం మంజూరు అవుతాయన్నారు. డెప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు ఉన్నారు.

# 450 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న శోభారాణి

వెల్దుర్తి: నరసరావుపేట డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం వెల్దుర్తి బాబు శ్రీదివి రంగనాథాచార్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి ముఖ్యఅతిథిగా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్డియాలజీ డాక్టర్ కోటా శబరి గిరీష్, క్రిటికల్ కేర్ జనరల్ మెడిసిన్ డాక్టర్ చింత కృష్ణచైతన్య, స్త్రీల సంబంధిత వ్యాధుల డాక్టర్ లోకిరెడ్డి సుష్మారెడ్డి, సృజన, ఆర్థోపెడిక్ డాక్టర్ చెన్నారెడ్డి, ఈఎన్‌టీ విభాగ డాక్టర్ వేపూరి రాజేష్, డాక్టర్ రజిత, జనరల్ సర్జన్ డాక్టర్ శివతేజలు సేవలు అందించారు. ఉచితంగా ఓపీ, రక్త పరీక్షలతోపాటు ఈసీజీ, టుడీ ఎకో టెస్టులను 450 మంది రోగులకు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఇలాంటి వైద్య శిబిరాలు గతంలో వెల్దుర్తి మండల స్థాయిలో నిర్వహించలేదని, తొలిసారిగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వారు వైద్య పరికరాలను తీసుకొచ్చి ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని శోభారాణి అన్నారు. హాస్పిటల్ పరిపాలన అధికారి పరిటాల సత్యనారాయణ, పీఆర్‌వో కోటేశ్వరరావు, టీడీపీ కార్యకర్తలు జూలకంటి పోలిరెడ్డి వెంకటరెడ్డి, పులుసు వీరారెడ్డి, పులుసు గురవారెడ్డి, కేశిరెడ్డి వెంకటరెడ్డి, కాయతి నాగిరెడ్డి, కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, జూలకంటి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ రంగం బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



ఫ్లెక్సీపై ఉన్న చంద్రబాబు బొమ్మకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: భవన నిర్మాణరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా తీసుకున్న ఉచిత ఇసుక నిర్ణయం హర్షణీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని గడియార స్తంభం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ట్రాక్టర్ రూ.5 వేలు నుంచి రూ.10 వేలు ఉండేదని, ప్రస్తుతం రూ.1,500కి అందుబాటులో వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందించి భవన నిర్మాణ రంగాన్ని బలోపేతం చేయాలని కంకణం కట్టుకుందన్నారు. ఎవరు ఎన్ని రకాల అపవాదులు వేసిన, విమర్శలు చేసిన మాకు ప్రజా సంక్షేమమే ముఖ్యమని పేర్కొన్నారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికుల భవిష్యత్ ప్రధానమని చెప్పారు. వేముల పాండు రంగారావు, సత్యనారాయణ, వెంకట్రావు, వల్లెపు నాగేశ్వరరావు, మడక ప్రసాద్ పాల్గొన్నారు.

# విత్తన బంతులు చల్లిన పల్లె సృజన బృందం



నల్లమలలో విత్తన బంతులు చల్లుతున్న ప్రకృతి ప్రేమికులు

కారెంపూడి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పల్లె సృజన పత్రిక పాత్రికేయులు, ప్రకృతి ప్రేమికులు పలువురు ఆదివారం నల్లమల అటవీ ప్రాంతంలో విత్తన బంతులు చల్లారు. పర్యావరణ పరిరక్షణకు అడవుల వృద్ధికి కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) చేస్తున్న కృషిని గుర్తించి ఆయనకు సంఘీభావం తెలిపేందుకు వీరంతా తరలివచ్చారు. వారు కారెంపూడి వచ్చి పల్నాటి రణక్షేత్రంలోని పల్నాటి వీర్ల అంకాలమ్మ, చెన్నకేశవస్వామి, వీరుల గుడిని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నల్లమల అడవికి వెళ్లి విత్తన బంతులు చల్లారు. వ్యయ ప్రయాసలకోర్చి వారు రావడంపై అంకారావు హర్షం వ్యక్తం చేశారు. ఎవరి ప్రాంతాలలో వారు ఈ బంతులు చల్లడం, మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# 17న అర్ధ చాతుర్మాస్య దీక్ష ప్రారంభం

అమరావతి: స్థానిక శ్రీవాసవి నిత్యాన్నసత్ర వానప్రస్థాశ్రమ సేవా సంఘ భవనంలో ఈ నెల 17వ తేదీన అర్ధచాతుర్మాస దీక్ష ప్రారంభోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్ఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన కార్యక్రమ వివరాలు తెలియచేస్తూ తెనాలికి చెందిన పూజ్య శ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీ 17న నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు దీక్ష కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ రెండు నెలల్లో వచ్చే వివిధ పండగలు, పర్వదినాలను స్వామి వారి చేతుల మీదుగా శాస్త్రోక్తంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# నిబంధనలు మీరితే నర్సరీలపై చర్యలు

ఉద్యాన శాఖాధికారి మోహన్



రెంటచింతలలోని నర్సరీ నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న అధికారి వై.మోహన్

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అందించే సబ్సిడీతో నర్సరీ(షేర్‌నెట్)లను ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని గురజాల ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ పేర్కొన్నారు. ఆదివారం రెంటచింతలలోని పలు నర్సరీలను ఆయన సందర్శించారు. నిర్వాహకులకు మిర్చినారు పెంపకం, షేర్ నెట్ ప్రయోజనాలపై పలు సూచనలు చేశారు. నర్సరీ రిజిస్ట్రేషన్ కోసం పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. దరఖాస్తు ఫారం– ఏ , రూ.1000 చలాన( బ్యాంక్ వివరాలు), పట్టాదారు, లీజ్ కాపీ పాస్ పుస్తకం నకలు, కౌలు ఖరారు నమూనా, నర్సరీ నమూనా, భూసార, నీరు నమూనా పత్రాలను రిజిస్ట్రేషన్ కోసం అధికారులకు ఇవ్వాల్సి ఉందన్నారు. మిరప విత్తనాలను ప్రొట్రేలలో నాటి వాటిని ఎత్తైన మడులపై అమర్చాలన్నారు. కోకో పీట్‌ను ఒక కేజీ ట్రైకోడెర్మావిరిడి, కేజీ సూడోమోనాస్‌తో శుద్ధి చేసుకోవాలన్నారు. ప్రొట్రేలలో శుద్ధి చేసిన కోకో పీట్‌ను మాత్రమే వినియోగించాలని చెప్పారు. ఉద్యాన శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టాక్ రిజిస్టర్, ప్రొడక్షన్ వివరాలు, సేల్స్, నర్సరీ మెయింటెనెన్స్, మిర్చి మొక్కల పెంపకం, క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. నర్సరీ నిర్వాహకులు మొత్తం 7 రికార్డులను మెయింటైన్ చేయాల్సి ఉంటుందన్నారు. రైతులకు వారు అడిగిన కంపెనీలకు చెందిన మిర్చి నారు మాత్రమే అందించాలని చెప్పారు. నాసిరకం నారును విక్రయించిన నర్సరీ యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా మిర్చి నారును విక్రయించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మొక్కలను విక్రయించే సమయంలో ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. అందులో మిర్చి విత్తనం రకం, కంపెనీ పేరు, లాటు నెంబర్, మొక్కల సంఖ్య, ధరను కచ్చితంగా నమోదు చేయాల్సి ఉందన్నారు. నర్సరీల నిర్మాణ, నిర్వహణ సమయాలలో ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటే తక్కువ ఖర్చుకే రైతులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ రకాల నాణ్యమైన హైబ్రిడ్ మిర్చి మొక్కలను అందించవచ్చన్నారు.

### జీపీఎస్ రద్దు చేయాలని జీఓ ప్రతుల దహనం



పిడుగురాళ్ల: ఎలాంటి విధివిధానాలు రూపొందించకుండా జీపీఎస్ అమలుకు ఇటీవల విడుదల చేసిన జీఓను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పిడుగురాళ్ల యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆదివారం మాట్లాడారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జె. విజయసారథి ఆధ్వర్యంలో జీఓ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నూతన ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆనందం నింపాలంటే ఈ జీవో రద్దు చేయాలని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కూడా వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. నూతన ప్రభుత్వం ఉద్యోగుల సానుకూల, న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాసీం పీరా, ఎం.సాంబశివరావు, జమాల్, విశ్వరూపాచారి, ప్రసాద్, షేక్ ఫిరోజ్ బాషా, పి. నాగేశ్వరరావు, ఎన్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కొంగు బంగారం... దేశమ్మ తల్లి



బోనాల్లో పాల్గొన్న భక్తులు

- 75త్యాళ్ళూరులో దేశమ్మ తల్లికి బోనాలు
- పొంగళ్లు పొంగించి, జల బిందెలతో వారు పోసిన భక్తులు
- అమ్మవారికి ఉమ్మడి పొంగళ్లు



పూజలు అందుకుంటున్న దేశమ్మ తల్లి

పెదకూరపాడు: కొంగు బంగారు తల్లిగా కోరిన కోర్కెలు తీర్చే అమ్మ దేశమ్మ తల్లి ఆషాడ మాస ఉత్సవాలు మండలంలోని 75 త్యాళ్ళూరు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక పొంగళ్లు పొంగించారు. అనంతరం జలబిందెలతో అమ్మవారికి వారు పోశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడ మాసంలో వచ్చే రెండవ ఆదివారం అమ్మవారికి గ్రామంలోని అందరు వారుపోసి పొంగళ్ల నైవేద్యంగా (బోనాలు) సమర్పిస్తారన్నారు. గ్రామ పెద్దకాపు మొదటి పొంగళ్లను అమ్మవారికి అందించారు. గ్రామంలోని మహిళలు, పెద్దలు, చిన్నలు అమ్మవారికి జలబిందెలతో వారు పోశారు. మేళతాళలతో గ్రామంలో మహిళలు ప్రభను కట్టుకొని అమ్మవారికి పొంగళ్లు, పసుపు కుంకుమ సమర్పించారు. సాయంత్రం గ్రామంలో జాతర నిర్వహించి పోతులను సమర్పించి సామూహికంగా అన్న సంతర్పణ చేశారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



సత్తెనపల్లి: ఆర్టీసీ బస్, టాటా ఏస్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని శివాలయం తర్వాత మలుపులో ఆదివారం జరిగింది. సత్తెనపల్లి–అచ్చంపేట రోడ్డు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో శివాలయం దాటిన తర్వాత మూల మలుపులో చెత్తను నిల్వ చేసే ఇనుప బాక్సులను పురపాలక సంఘం ఏర్పాటు చేయడంతో వాటిని తప్పించే క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలలకు తరలించారు. ఆ ప్రాంతంలో ప్రమాదాల నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆందోళన చేశారు. జనం గుమికూడటంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రాణాప్రాయం నుంచి బయట పడటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.